సాక్షి
పార్వతీపురం మన్యం
గురువారం । 1 । ఆగస్టు । 2024



రిజిస్ట్రేషన్ నిబంధనలకు తూట్లు

వాహనం అమ్మినా, లేదా వేరే ప్రాంతానికి వాహన యజమాని మారినా అక్కడ రిజిస్ట్రేషన్ కోసం సమస్య ఏర్పడుతోంది. - 8లో



కేసుల్లో దర్యాప్తు వేగవంతం

వివిధ కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి. మాధవరెడ్డి అన్నారు. - 8లో



లాభాల బాటలో డీసీసీబీ

డీసీసీబీ ప్రగతి బాటలో పయనిస్తోందని, డిపాజిట్లు, పెట్టుబడులను మరింత పెంచేందుకు కృషి చేయాలని జేసీ కె.కార్తీక్ సిబ్బందికి సూచించారు. - 8లో

న్యూస్‌రీల్

సత్యహరిశ్చంద్ర విగ్రహావిష్కరణ



సత్యహరిశ్చంద్ర విగ్రహావిష్కరణ చేస్తున్న దృశ్యం

సాలూరు: పట్టణంలోని స్వర్గధామం వద్ద సత్యహరిశ్చంద్ర విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. డాక్టర్ వాడాడ గణేశ్వరరావు, కమిటీ సభ్యులు తాతాజీ, సాంబమూర్తి, చంద్రశేఖర్, షణ్ముఖ ముత్యాలు, శ్రీనివాసరావు తదితరులు ఈ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం శిల్పి సుబ్బారావును సత్కరించారు.

బాధ్యతగా విధి నిర్వహణ

- జీసీసీ డీఎం వి.మహేంద్ర కుమార్



సేల్స్‌మెన్, డీలర్లకు సూచనలు చేస్తున్న డీఎం మహేంద్ర కుమార్

గుమ్మలక్ష్మీపురం: జీసీసీ ఉద్యోగులు బాధ్యతతో విధులు నిర్వహించాలని, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని పార్వతీపురం జీసీసీ డివిజనల్ మేనేజర్ వి.మహేంద్ర కుమార్ హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఆయన గుమ్మలక్ష్మీపురం గిరిజన మార్కెటింగ్ సొసైటీ బ్రాంచ్ కార్యాలయంలో సేల్స్‌మెన్, డీలర్లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమయ పాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ నిర్ణీత గడువులోగా నిత్యావసర సరుకులను అందివ్వాలని కోరారు. అనంతరం ఆయన ఇండేన్ గ్యాస్ గొడౌన్, ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్‌తో పాటు పెట్రోల్ బంకును తనిఖీ చేసి నిల్వలు, రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట బ్రాంచ్ మేనేజర్ కృష్ణ ప్రసాద్, అకౌంటెంట్ గణపతి, గొడౌన్ ఇన్‌చార్జ్ ఎం.సాంబశివరావు, పెట్రోల్ బంక్ ఇన్‌చార్జ్ పి.కృష్ణ ఉన్నారు.

వర్మీ కంపోస్టు తయారీపై శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్తలు

కురుపాం: వానపాములతో ఎరువుల తయారీ (వర్మీ కంపోస్టు)పై మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులు రస్తాకుంటుబాయి కృషివిజ్ఞాన కేంద్రంలో బుధవారం ప్రారంభమయ్యాయి. అగ్రికల్చర్ స్కిల్ కాన్సెప్ట్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో 40 మంది యువతీ యువకులకు ఎరువుల తయారీపై నైపుణ్యశిక్షణ ఇస్తున్నారు. శాస్త్రవేత్త జి.అమృతవీణ వానపాముల రకాలు, ఎరువుల తయారీ విధానం, వానపాముల ఎరువుల కలిగే ప్రయోజనాలు, సేంద్రియ ఉత్పత్తులకు పెరుగుతున్న గిరాకీపై అవగాహన కల్పించారు. నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కృషివిజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ధ్రువ సూచించారు. శిక్షణ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసరాజు, డాక్టర్ ఎస్.శ్రవంతి, డాక్టర్ అనంత్ విహారి, ఉమా జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

దిశ డీఎస్పీ హరిత బదిలీ



దిశ డీఎస్పీ ఎస్ఆర్ హరిత

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా దిశ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఎస్సార్ హరితను తిరుపతి డీఎస్పీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పార్వతీపురం మన్యం జిల్లాలో తొలి దిశ డీఎస్పీగా ఆమె విధులు నిర్వహించారు. దిశ యాప్ డౌన్‌లోడ్, మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా మహిళల రక్షణపై ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేవారు.

నేటి నుంచి ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు



డీఎంహెచ్ఓ కె.విజయ పార్వతి

పార్వతీపురంటౌన్: ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఆగస్టు 1వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె.విజయ పార్వతి తెలిపారు. ఈ వారోత్సవాలు ఆగస్టు 7వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

- విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల ప్రజలపై మరింత టోల్ భారం!
- భోగాపురం, జొన్నాడ టోల్‌గేట్లతో వాహనదారులకు తడిసిమోపెడు
- శరవేగంగా సిద్ధమవుతున్న కొర్లాం, మానాపురం టోల్‌గేట్లు
- ఎన్‌హెచ్‌ఏఐ చూపించిన బాదుడు మార్గంలో కూటమి ప్రభుత్వం
- ప్రధానమైన 4 రాష్ట్ర రహదారులపై టోల్‌గేట్‌లు పెట్టాలని ప్రయత్నం
- పీపీపీ విధానంలో అభివృద్ధి పేరుతో వాతలు పెట్టేందుకు సన్నాహాలు

ఇది జొన్నాడ టోల్‌ప్లాజా. విశాఖ-రాయ్‌పూర్ జాతీయ రహదారిపై విజయనగరం జిల్లా, విశాఖ జిల్లా సరిహద్దులో ఇటీవలే వెలిసింది. ప్రతిరోజూ విజయనగరం నుంచి విశాఖపట్నానికి ఏదోక వ్యాపకం నిమిత్తం వెళ్లేవారే కాదు రెండు జిల్లాల మధ్య షటిల్ సర్వీసు చేసే ఉద్యోగులు వేల సంఖ్యలో ఉంటారు. వారిలో ఎక్కువ మంది కార్లలో ప్రయాణించేవారే. టోల్‌గేట్ వద్ద అడుగుపెడితే చాలు వాహనాన్ని బట్టి రూ.60 నుంచి రూ.560 వరకూ ముక్కుపిండి వసూలుచేస్తున్నారు. అంతేకాదు ఆర్టీసీ బస్సుల్లో టికెట్‌కు రూ.10 అదనంగా సామాన్య ప్రయాణికులపై భారం పడుతోంది. దీన్ని తొలగించాలని అన్నివర్గాల నుంచి ఆందోళన వ్యక్తమవుతోంది. చిత్రమేమిటంటే... ఈ సమస్యను పరిష్కరించాల్సింది కూటమి ప్రభుత్వమే. అటు కేంద్రంలోను, ఇటు రాష్ట్రంలోనూ అధికార భాగస్వాములైన టీడీపీ, జనసేన పార్టీ నాయకులు కూడా ఈ గేట్ దగ్గరకొచ్చి మొసలికన్నీరు కార్చడమే విచిత్రం. కేంద్రానికి లేఖ రాశానంటూ జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సన్నాయినొక్కులు నొక్కుతున్నారు. ఎవరు గొంతు చించుకున్నా ఈ టోల్‌గేట్ వద్ద బాదుడు మాత్రం ఆగట్లేదు.



టోల్‌తీస్తారు ..!

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలకు మంచి చేయాల్సింది పోయి.. జనాల జేబులకు చిల్లు వేసే మార్గాలను అన్వేషిస్తోంది. సంపద సృష్టి పేరుతో 'టోల్'బాదుడుకు 'గేట్లు' బార్లా తెరవడంపై వాహన చోదకులు హడలిపోతున్నారు. రాష్ట్ర రహదారులపై ఏర్పాటుచేసిన టోల్‌ప్లాజాలు పల్లె ప్రజలకు మరింత భారం కానున్నాయి. స్థానికంగా వ్యవసాయ ఉత్పత్తులు తరలించే వాహనాలకూ పన్నుపోటు తప్పదు.

రహదారిపైకి ఒకసారి టోల్ గేట్ వచ్చిందంటే ఏళ్ల తరబడి దానికి రుణం చెల్లించుకోవాల్సిందే. ఉభయ విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల ప్రజలు నాతవలస మీదుగా విశాఖ వెళ్లాలనుకుంటే భోగాపురం వద్దనున్న టోల్‌గేట్ వద్ద రుసుం చెల్లిస్తున్నారు. ప్రత్యామ్నాయంగా రాజాపువలస మీదుగా వెళ్లాలనుకుంటే జొన్నాడ టోల్‌ప్లాజా నడ్డివిరుస్తోంది. ఈ రెండూ మంచి లాభసాటిగా ఉండడంతో భారత జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) విజయనగరం జిల్లాలోనే మరో రెండు టోల్‌ప్లాజాలకు పచ్చజెండా ఊపింది. విజయనగరం నుంచి బొడ్డవర మీదుగా అరకు వెళ్లాలనుకుంటే కొర్లాం వద్ద సిద్ధమైన గంట్యాడ టోల్‌ప్లాజా వద్ద మరికొద్ది రోజుల్లో బాదుడు తప్పదు. రామభద్రపురం, సాలూరు, బొబ్బిలి, పార్వతీపురం తదితర ప్రాంతాలకు రాయ్‌పూర్ రోడ్డులో వాహనాల్లో ప్రయాణించేవారి జేబు గుల్ల చేసేందుకు మానాపురం వద్ద మరో టోల్‌ప్లాజా సిద్ధమవుతోంది. వీటితోనే తలబొప్పి కడుతుంటే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కూడా ఎన్‌హెచ్‌ఏఐ బాటనే పయనిస్తోంది. ప్రైవేట్, ప్రభుత్వ భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో రాష్ట్ర రహదారుల అభివృద్ధి అనే ముసుగులో దండుకోవడానికి ప్రతిపాదనలు రచిస్తోంది.



భోగాపురం వద్ద టోల్‌ప్లాజా

కొత్తగా టోల్ గేట్లు ఎక్కడెక్కడంటే..

గార-అలికాం-చింతాడ-బత్తిలి రోడ్డు
(84.80 కిలోమీటర్లు)

కళింగపట్నం-శ్రీకాకుళం-పార్వతీపురం రోడ్డు
(113.30 కి.మీ)
(పార్వతీపురం మన్యం జిల్లాను శ్రీకాకుళం జిల్లాతో అనుసంధానం చేస్తున్న ప్రధాన రహదారులు ఇవి)

చిలకపాలెం జంక్షన్ నుంచి పొందూరు, రాజాం, రామభద్రపురం మీదుగా రాయగడ రోడ్డు
(130.20 కిమీ)
(చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారిని విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలతో కలిపే రోడ్డు ఇది)

విశాఖపట్నం-కొత్తవలస-శృంగవరపుకోట-అనంతగిరి-అరకు రోడ్డు
(106.70 కిమీ)
(విశాఖ నగరాన్ని విజయనగరం జిల్లాతో అనుసంధానం చేయడమే గాక అరకు తదితర పర్యాటక ప్రాంతాలకు వెళ్లే రోడ్డు ఇది)

● ఎస్‌హెచ్‌లపైనా టోల్‌గేట్‌లు...

వాహనాల రద్దీ అధికంగా ఉన్న రాష్ట్ర రహదారుల (ఎస్ హెచ్) విస్తరణ, పునరుద్ధరణ (రెన్యువల్) అంటూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కూనిరాగం ఎత్తుకుంది. ఇందుకు ప్రైవేట్, ప్రభుత్వ భాగస్వామ్యం (పీపీపీ) అనే విధానానికి దుమ్ము దులిపి మళ్లీ తెరపైకి తెస్తోంది. కాంట్రాక్టర్లకు రోడ్ల విస్తరణతో పాటు నిర్వహించడం అనే బాధ్యతను అప్పగించనుంది. ఇందుకయ్యే వ్యయాన్ని ఆ రోడ్డుకు అడ్డంగా టోల్‌గేట్ పెట్టి వసూలు చేసుకొనే హక్కు కల్పిస్తుంది. ఖర్చు పెట్టినదంతా తనకు రాలేదని కాంట్రాక్టర్లు చెబితే ఆ మొత్తం ఎంతో వయబులిటీ గ్యాప్ ఫండ్ పేరుతో సర్దుబాటు చేయడానికీ సిద్ధమవుతోంది. అంటే ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రజలకు బాదుడే బాదుడు ఎలా ఉంటుందో రుచిచూపించనుంది.

రెండు జిల్లాల్లో నాలుగు రోడ్లపై గేట్లు...

తొలిదశలో రాష్ట్రంలోని 27 ఎస్‌హెచ్‌లను కూటమి ప్రభుత్వం గుర్తించింది. వీటిలో నాలుగు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఉన్నాయి. వాస్తవంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం టోల్‌గేట్‌ల ఏర్పాటుకు యత్నిస్తున్న రోడ్లను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చాలావరకూ అభివృద్ధి చేసినా టోల్ వసూలు గురించి ఆలోచించలేదు. కూటమి ప్రభుత్వం మాత్రం టోల్‌గేట్‌లు పెట్టి వసూలు చేసుకోవాలనే ప్రయత్నాలపై ప్రజల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



గంట్యాడ మండలంలో కొర్లాం వద్ద సిద్ధమైన టోల్‌ప్లాజా

గ్రామీణ ప్రజలను ఇబ్బంది పెట్టడమే...



పొందూరు నుంచి రాజాం మీదుగా రామభద్రపురం వరకూ ఉన్న రహదారిలో టోల్ గేట్ ఏర్పాటు చేయడమంటే గ్రామీణ ప్రజలను, రైతులను ఇబ్బందులు పెట్టడమే. రైతు వారీ వ్యాపారాలు ఈ ప్రాంతంలో ఎక్కువ. రాష్ట్రప్రభుత్వం ప్రజలు నుంచి వసూళ్లకు ఇదొక కొత్త ఎత్తుగడ అనిపిస్తుంది.

– కామోదుల శ్రీరంగంనాయుడు, పొగిరి, రాజాం మండలం.



రాజాం-పొందూరు మధ్య గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మించిన రహదారి

టోల్ వసూలు ఆలోచన వద్దు...



అరకు–విశాఖ రోడ్డులో కూటమి ప్రభుత్వం టోల్ గేటు పెట్టే ఆలోచనను విరమించాలి. ఈ రోడ్డులో నిత్యం స్థానికులమే ప్రయాణిస్తుంటాం. టోల్‌గేటు వేస్తే అన్ని రకాల చార్జీలు పెరుగు పోతాయి. అంతంత మాత్రంగానే ఉన్న మా బతుకులపై నీళ్ల చల్లవద్దు. సంపద సృష్టిస్తాం అంటే రోడ్లుపై టోల్ గేట్లు పెట్టి సంపద సృష్టిస్తారని తెలుసుకోలేకపోయాం.

– జవ్వాది అప్పలస్వామి, ఆర్‌జీ పేట గ్రామం, లక్కవరపుకోట మండలం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.9 కోట్లతో పునర్నిర్మించిన విశాఖ-అరకు రోడ్డు

మళ్లీ ప్రజలపైనే భారం



ఏటీబీ రహదారిలో ప్రస్తుతం ఎటువంటి టోల్ గేట్లు లేవు. ఒడిశాలో కూడా అంతగా భారం పడటం లేదు. రాష్ట్ర ప్రభుత్వం స్థానికంగా టోల్ గేట్లు ఏర్పాటుచేస్తే ఆ భారం ఇక్కడి ప్రయాణికులపైనే పడుతుంది. బస్సు ప్రయాణికులకు టికెట్‌పై రూ.25 వరకూ టోల్ పన్ను అదనంగా కలిపి వసూలు చేయవచ్చు. ఇదంతా ప్రజలపై భారం.

– భోనగడ్డి ధర్మారావు, భామిని మండలం



టోల్ గేట్ ఏర్పాటుకు యత్నిస్తున్న భామిని మండలం మీదుగా ఒడిశా వెళ్లే ఏటీబీ రహదారి

ప్రజలపై మోయలేని భారం



కాంట్రాక్టర్ల స్వలాభం కోసం లక్షలాది మంది ప్రజలపై భారం వేసేందుకు టోల్ గేట్‌లు ఏర్పాటు చేయడం అన్యాయం. డెంకాడ మండలంలో ఎటువంటి రోడ్లు నిర్మాణాల లేకుండా కేవలం ఉన్న రోడ్డును కొంత మేర వెడల్పు చేసి అక్కడ అక్రమంగా టోల్‌గేట్ ఏర్పాటు చేశారు. పలితంగా విజయనగరం–విశాఖల మధ్య నిత్యం రాకపోకలు సాగించే విద్య, ఉపాధి, వ్యాపార రంగాలకు చెందిన వారితో పాటు సామాన్య ప్రజలపై మోయలేని భారం పడింది. తక్షణమే టోల్ గేట్‌ను తొలగించాలి.

– కాపుగంటి ప్రకాష్, కార్యదర్శి, ఫోరం ఫర్ బెటర్ విజయనగరం

ఆగస్టు 15 పరేడ్‌కు సోంపురం విద్యార్థి ఎంపిక

వేపాడ: మండలంలో సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి విశ్వనాథ్ రాకేష్ విజయవాడలో ఆగస్టు 15న జరిగే స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్ శిక్షణకు ఎంపికైనట్టు హెచ్‌ఎం బీపీఏ రాజు తెలిపారు. పాఠశాలలోని సేవాశ్రీ స్కౌట్ యూనిట్ నుంచి రాకేష్ ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. జిల్లా కేంద్రంలో ప్రాంతీయ శిక్షణ కేంద్రం జిల్లా కార్యదర్శి వి.చిన్నంనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపికలో జిల్లా నుంచి పరేడ్‌కు నలుగురిని ఎంపికచేయగా వీరిలో పాఠశాల విద్యార్థి ఉన్నారన్నారు. ఈ నెల 1 నుంచి 14 వరకు శిక్షణ అనంతరం 15న స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్‌లో పాల్గొంటారని చెప్పారు. విద్యార్థికి ఎస్కార్ట్‌గా బేసిక్ స్కౌట్ టీచర్ పి.రమేష్‌నాయుడు వ్యవహరిస్తారన్నారు. విద్యార్థిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

20మంది తహసీల్దార్లకు పోస్టింగులు

పార్వతీపురం టౌన్: జిల్లాలో 20మంది తహసీల్దార్లకు పోస్టింగులు కేటాయిస్తూ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కమిషన్ ఆదేశాలతో వివిధ జిల్లాలకు వెళ్లిన తహసీల్దార్లు గతవారం జిల్లాకు తిరిగిరాగా వారికి బుధవారం ఉదయం పోస్టింగులు కేటాయిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. పార్వతీపురం తహసీల్దార్‌గా జీవీ జనార్దన్, సీతానగరం పి.అప్పలరాజు, బలిజిపేట ఆర్.ఉమామహేశ్వరరావు, భామిని పి. సోమేశ్వరరావు, సీతంపేట ఎం.అప్పారావు, సాలూరు ఎస్.వి. రమణ, పాచిపెంట డి.రవి, కురుపాం ఎం.రమణమ్మ, పాలకొండ ఆర్.బాలమురళీకృష్ణ, గరుగుబిల్లి ఎం.భుజంగరావు, కొమరాడ జె.రాములమ్మ, గుమ్మలక్ష్మీపురం ఆర్.రమేష్ కుమార్, జియ్యమ్మవలస తహసీల్దార్‌గా డీవీ సీతారామయ్యలను నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో కలెక్టర్ పేర్కొన్నారు. పార్వతీపురం కలెక్టరేట్ పరిపాలన అధికారిగా ఎం.సావిత్రి, పార్వతీపురం ఆర్డీఓ కార్యాలయం పరిపాలన అధికారిగా ఎస్.నరసింహమూర్తి, కలెక్టరేట్ ఈ ఎఫ్‌జి సెక్షన్ సూపరింటెండెంట్‌గా జి.శ్రీరామ్మూర్తి, కేఆర్ఆర్‌సీ స్పెషల్ తహసీల్దారుగా ఎన్.భాస్కరరావు (పార్వతీపురం), కేఆర్ఆర్‌సీ స్పెషల్ తహసీల్దార్‌గా వి.రామస్వామి (పాలకొండ), కలెక్టరేట్ డి హెచ్–సెక్షన్ సూపరింటెండెంట్‌గా ఎన్.శివన్నారాయణ, కలెక్టరేట్ సి–సెక్షన్ సూపరింటెండెంట్‌గా సీహెచ్ రాధాకృష్ణను నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ స్పష్టం చేశారు.

వీఆర్ఎస్ ప్రాజెక్టు నీరు విడుదల

- పాల్గొన్న మంత్రి సంధ్యారాణి, బొబ్బిలి, పార్వతీపురం ఎమ్మెల్యేలు రంగారావు, విజయచంద్ర



నీరు విడుదలచేస్తున్న మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు రంగారావు, విజయచంద్ర

మక్కువ: మండలంలోని శంబర గ్రామ సమీపంలోని వెంగళరాయసాగర్ ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకు గిరిజనశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, బొబ్బిలి, పార్వతీపురం ఎమ్మెల్యేలు ఆర్‌వీఎస్‌ఆర్‌కే రంగారావు, బోనెల విజయచంద్ర బుధవారం సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. జైకా నిధులతో గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ప్రాజక్ట్ ఆధునికీకరణ పనులు కాంట్రాక్టర్లకు బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో నిలిచిపోయాయన్నారు. ప్రాజెక్టు నుంచి మక్కువ, బొబ్బిలి, పార్వతీపురం మండలాల్లోని 24,700 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉందన్నారు. శివారు భూములకు సాగునీరు అందేలా మిగులు పనులు పూర్తిచేసేందుకు నిధులు విడుదల చేయాలని నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రాజెక్టు వద్ద దివంగత నేతలు నందమూరి తారకరామారావు, జలగం వెంకట్రావు, జన్ని ముత్యాలు విగ్రహాలను ఏర్పాటుచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ వై.రాజేశ్వరి, ఈఈ ఆర్.అప్పలనాయుడు, డీఈ సురేష్, జేఈలు, మండల టీడీపీ అధ్యక్షుడు గుళ్ల వేణుగోపాలరావు, ఎంపీడీఓ పి.దేవకుమార్, మక్కువ, పార్వతీపురం, బొబ్బిలి మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెన్షన్ టెన్షన్..!



- ప్రతి నెలా తగ్గిపోతున్న సామాజిక పింఛన్ల సంఖ్య
- అర్హులకు మొండిచేయి చూపుతున్న ప్రభుత్వం
- నేటి నుంచి 'ఎన్టీఆర్ భరోసా' పంపిణీ
- ఈ నెల ఎవరి పెన్షన్ పోతుందోనని లబ్ధిదారుల ఆందోళన

సాక్షి, పార్వతీపురం మన్యం:

కొత్త నీరు వచ్చి పాత నీరు కొట్టుకు పోయిందన్న చందాన ఉంది పింఛన్ లబ్ధిదారుల పరిస్థితి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో పెన్షన్ అందుకున్న లబ్ధిదారుల సంఖ్య కొత్త ప్రభుత్వం వచ్చాక ప్రతి నెలా తగ్గిపోతోంది. ఈ ఏడాదికి చివరిసారిగా గత ప్రభుత్వం మే నెలకు సంబంధించిన పింఛన్లు పంపిణీ చేయగా..అప్పటికి పార్వతీపురం మన్యం జిల్లాలో 1,45,071 మంది లబ్ధి పొందారు. ఆ తరువాత అధికారం మారి, కూటమి ప్రభుత్వం వచ్చాక.. మొదటి నెల జులైలో 1,44,518 మందికి లబ్ధిదారుల సంఖ్య తగ్గింది. ప్రస్తుత ఆగస్టు నెలకు సంబంధించి 1,43,398 మంది మాత్రమే లబ్ధిదారులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. రెండు నెలల కాలంలో 1,673 పింఛన్లు తగ్గడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొత్తవి మంజూరు చేయకపోగా, ఉన్నవి నిలిపివేస్తున్నారని..ఈ నెలలో ఎవరికి పెన్షన్ ఆగిపోయిందోనని జిల్లాలోని పలువురు లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

తొలిరోజే శతశాతం పంపిణీకి ఏర్పాట్లు

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని ఒకటో తేదీన ఉదయం 6 గంటల నుంచే పంపిణీ చేసేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఇందు కోసం గ్రామాల్లో దండోరా వేయించింది. ఈసారి కూడా సచివాలయ సిబ్బందితోనే పంపిణీ చేపట్టనున్నారు. వెలుగు ఏపీఎంలు, సీసీలు పింఛన్ల పంపిణీలో భాగస్వామ్యం కానున్నారు. పర్యవేక్షణకు జిల్లా అధికారులను మండల ప్రత్యేకాధికారులుగా నియమించారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షించనున్నారు. మొదటి రోజునే శతశాతం పంపిణీ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కదలలేక మంచానికే పరిమితమైన వారికి మొదటగా పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేశారు. అనివార్య కారణాల వల్ల లబ్ధిదారులు మిగిలితే రెండో రోజు అందజేస్తారు.

సచివాలయ సిబ్బందితోనే..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వలంటీర్ల ద్వారా ఇంటింటికీ పింఛన్ల పంపిణీ చేపట్టిన విషయం విదితమే. ప్రస్తుత ప్రభుత్వంలో వలంటీర్ల వ్యవస్థను నిలుపు చేశారు. వారు కొనసాగుతారా, లేదా? అన్నదానిపై ఇంకా సందిగ్ధం వీడలేదు. గత నెలలో కూటమి ప్రభుత్వం సచివాలయ సిబ్బందితోనే పింఛన్ల పంపిణీ చేపట్టింది. మొదటి నెల కావడంతో కూటమి నాయకులు అంతా తామై వ్యవహరించారు. ప్రస్తుత నెలలోనూ సచివాలయ సిబ్బంది సేవలనే వినియోగించుకుంటున్నారు. ఉదయం 6 గంటల నుంచే పంపిణీ ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశించగా.. సచివాలయ ఉద్యోగులు ఆ సమయానికి రావడంపై ఆందోళన చెందుతున్నారు. కొంతమంది స్థానికంగా ఉండడం లేదు. వారు ముందురోజు రాత్రే చేరుకుని విధులు నిర్వహించిన చోట ఉండాలని అధికారులు స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ వ్యవస్థలో ఎక్కువమంది మహిళా ఉద్యోగులే ఉన్నారు. తాము ఎలా ముందురోజు ఉండిపోగలమని, ఉదయాన్నే రావాలన్నా ఇబ్బందేనని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆత్మలకు పింఛన్ల పంపిణీ !

- సచివాలయం సిబ్బంది నిర్వాకం
- లబ్ధిదారు మరణించిన తరువాత పింఛన్ డ్రా
- సుమారు రూ.12 లక్షలు అక్రమాలు జరిగినట్లు గుర్తింపు



కురుపాం మండలకేంద్రంలో నిర్వహించిన ప్రజావేదికలో పాల్గొన్న సామాజిక తనిఖీ బృందం అధికారులు

కురుపాం: జిల్లా ప్రజలంతా ముక్కున వేలేసుకునేలా వ్యవహరించారు కురుపాం మండలంలోని నీలకంఠాపురం సచివాలయ సిబ్బంది. పదిరోజులుగా మండలంలోని 23 పంచాయతీల్లో చేపట్టిన పింఛన్ల పంపిణీపై పలు పంచాయతీల పరిధిలో అక్రమాలు గుర్తించేందుకు తనిఖీ బృందం బుధవారం ప్రజావేదిక నిర్వహించింది. నీలకంఠాపురం పంచాయతీతో పాటు పలు పంచాయతీల్లో ఈ తరహా అవినీతి జరిగిందని, నీలకంఠాపురం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో 39మంది చనిపోయిన వారికి డీబీటీ ద్వారా రూ.`6లక్షల 93 వేలు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు సామాజిక తనిఖీ బృందం గుర్తించింది. ఇద్దరు ఉద్యోగుల కుటుంబ సభ్యులకు రూ.36 వేలు, అలాగే, మృతి చెందిన తరువాత 16 మంది పింఛన్ రూ.52 వేలు నేరుగా డ్రా చేసినట్లు గుర్తించామని సామాజిక తనిఖీ బృందం ఎస్ఆర్‌పీ దాసు తెలిపారు. ఈ తనిఖీలో బయల్పడిన అంశాలపై డీఆర్డీఏ పీడీకి సమగ్రమైన నివేదిక పంపనున్నామని వివరించారు

క్లుప్తంగా

ఎస్‌ఎంసీ ఎన్నికల షెడ్యూల్ విడుదల


డీఈఓ జి.పగడాలమ్మ

పార్వతీపురం టౌన్: పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ)ల ఎన్నికలకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసినట్లు డీఈఓ జి.పగడాలమ్మ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తల్లిదండ్రుల కమిటీల పేరును మేనేజ్‌మెంట్ కమిటీగా మార్పు చేస్తూ ప్రస్తుత కమిటీల పదవీకాలం జూలైతో ముగియనుండడంతో ఆగస్టులో ఎన్నికలకు షెడ్యూల్‌ను ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల ఎన్నికకు ఆగస్టు 1వ తేదీన గురువారం ఉదయం 10 గంటలకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నామని, మధ్యాహ్నం 2 గంటలకు ఓటర్ల జాబితాను నోటీసు బోర్డులో ఉంచుతారని, ఆగస్టు 5న ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తారని తెలిపారు. అదే రోజు 3–4 గంటల మధ్య తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తారు. ఆగస్టు 8వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి, మొదటి సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

అంకిత భావంతో పనిచేసే వారికి గుర్తింపు

- ఎస్పీ వకుల్ జిందాల్


ఆత్మీయ వీడ్కోలు సభలో పాల్గొన్న ఎస్పీ వకుల్‌జిందాల్


విజయనగరం క్రైమ్: అంకిత భావంతో పని చేసే ఉద్యోగులకు ప్రజల్లో మంచి గుర్తింపు లభిస్తుందని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీ టీకు మోహనరావు, బొబ్బిలి సీఐ సేపాన తిరుమలరావు, విజయనగరం రూరల్ హెచ్‌సీ పాండ్రంకి వాసుదేవరావును జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. విధుల నిర్వహణలో వారి స్ఫూర్తిని కొనియాడారు. పోలీస్ ఉద్యోగంలో ప్రతిరోజూ కొత్తరకమైన సవాల్ ఎదురవుతూనే ఉంటుందని, దానిని సమయ స్ఫూర్తితో ఎదుర్కొని, సవాళ్లను అధిగమించాల్సి ఉంటుందన్నారు. ఉద్యోగ విరమణ చేస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బందికి ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉంటానని, వారికి అవసరమైన సహాయాన్ని అందిస్తానని ఎస్పీ భరోసా కల్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, ఏఆర్ అదనపు ఎస్పీ ఎం.ఎం.సోల్మన్, డీఎస్పీ యూనివర్స్, ఎస్‌బీ సీఐ ఈ.నరసింహమూర్తి, దిశ సీఐ బి.నాగేశ్వరరావు, పోలీస్ కంట్రోల్ రూమ్ సీఐ సీహెచ్ రాజశేఖర్, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, పోలీస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

సీతానగరం: మండలంలోని ఆర్.వెంకంపేట రైల్వే సమీపంలో పట్టాలు దాటుతున్న పి.పోలిశెట్టి (60) అనే వ్యక్తిని గుర్తు తెలియని ట్రైన్ ఢీకొట్టడంతో బుధవారం మృతి చెందాడు. దీనిపై రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆర్.వెంకంపేట గ్రామానికి చెందిన పి.పోలిశెట్టి చినభోగిలిలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నప్పుడు రైల్వే పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. ఈ ఘటనపై రైల్వే కీ మన్ అందించిన సమాచారం మేరకు ఎస్సై రవి వర్మ సంఘటనా స్థలంలో పరిశీలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బొబ్బిలి ఏరియా ఆస్పత్రికి పోలీసులు తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..


గౌరునాయుడు మృతదేహం

జామి: ఎల్.కోట మండలం భీమాళి గ్రామానికి చెందిన నెల్లి గౌరినాయుడు (34) మంగళవారం మండలకేంద్రం నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా జామి రింగ్‌రోడ్డు కూడలి వద్ద రెయిలింగ్‌ను బైక్ ఢీకొట్టడంతో కిందపడగా బలమైన గాయాలయ్యాయి. దీంతో కుటుంబసభ్యులు విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదుమేరకు హెచ్‌సీ ఈశ్వరరావు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹102	₹174	₹184

రిజిస్ట్రేషన్ నిబంధనలకు తూట్లు

- పన్నులు ఎగ్గొట్టేందుకు చీప్‌ట్రిక్స్
- బీహెచ్ సిరీస్‌తో తిరుగుతున్న నాలుగు చక్రాల వాహనాలు
- పొరుగు జిల్లాలో పట్టుబడిన బలిజిపేట వాహనదారు



బీహెచ్ సిరీస్‌తో ఉన్న నంబరు

సాక్షి, పార్వతీపురం మన్యం: దేశంలో వాహనాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి కొన్ని చిక్కులు ఉన్నాయి. ఒక రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వాహనం..మరో రాష్ట్రంలో ఉన్నవారికి అమ్మినా, లేదా వేరే ప్రాంతానికి వాహన యజమాని మారినా అక్కడ రిజిస్ట్రేషన్ కోసం సమస్య ఏర్పడుతోంది. ఆ ఇబ్బందిని తొలగించేందుకు కేంద్రం కొత్తగా బీహెచ్ సిరీస్ రిజిస్ట్రేషన్ విధానం ప్రవేశపెట్టింది. ఇది కాస్త దుర్వినియోగమవుతోంది. నూతన విధానంలో ఉన్న వెసులుబాటును ఉపయోగించుకుంటూ, కొంతమంది నిబంధనలకు విరుద్ధంగా ఈ సిరీస్‌ను పొందుతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలోనూ ఈ వాహనాలు యథేచ్ఛగా రోడ్లపై తిరుగుతున్నాయి. ఇటీవల బలిజిపేటకు చెందిన ఓ వ్యక్తి తన బీహెచ్ సిరీస్ కారుతో విశాఖలో పట్టుబడినట్లు అధికార వర్గాల భోగట్టా. దీంతో అక్కడి అధికారులు ఆ కారును సీజ్ చేశారు.

పార్వతీపురం నియోజకవర్గంలోని అధికార పార్టీకి చెందిన ఓ కీలక నేత వద్ద కూడా ఈ తరహా సిరీస్‌తో వాహనం ఉన్నట్లు సమాచారం. మరికొంతమంది కూడా ఈ జాబితాలో ఉన్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది.

ఖర్చు తగ్గించుకోవచ్చు..
పన్నులు ఎగ్గొట్టవచ్చని..

మోటార్ వాహనాల చట్టం, 1988 సెక్షన్ 47 ప్రకారం వాహనాన్ని నమోదు చేయడం తప్పనిసరి. ప్రస్తుతం ఉన్న చట్టం ప్రకారం..ఒక రాష్ట్రంలో వాహనం కలిగి ఉన్న ఏ వ్యక్తి అయినా ఇతర రాష్ట్రాలకు వెళ్లినప్పుడు తప్పనిసరిగా తన వాహనాన్ని తిరిగి నమోదు చేసుకోవడానికి దరఖాస్తు చేసుకోవాలి. సాధారణంగా ఇతర రాష్ట్రాల్లో తన వాహనాన్ని రీ-రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే..వాహన యజమాని మాతృ రాష్ట్రం నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్..తప్పనిసరిగా సమర్పించాలి. దాన్ని పొందడం కోసం చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. తాను ఎక్కడ వాహనం రిజిస్ట్రేషన్ చేశాడో అక్కడికి వెళ్లి ఆ సర్టిఫికెట్ తెచ్చుకోవాలి. ఇది ఖర్చుతో కూడుకున్నది కావడంతో పాటు సమయం వృథా. దీంతో పాటు, వాహన యజమాని కొత్త రాష్ట్రంలో ప్రో-రాటా ప్రాతిపదికన అదే వాహనంపై మళ్లీ రోడ్డు పన్ను చెల్లించాలి. అప్పుడు అతను మాతృ రాష్ట్రంలో ఇప్పటికే చెల్లించిన రహదారి పన్ను వాపసు కోసం దరఖాస్తు చేసుకోవాలి. మొత్తం ప్రక్రియ చాలా సుదీర్ఘంగా ఉంటుంది. అటువంటి పరిస్థితిలో వాహన యజమాని బీహెచ్-సిరీస్ రిజిస్ట్రేషన్ కలిగి ఉంటే ఈ ఇబ్బందులేవీ ఉండవు. దీనికితోడు టోల్‌గేట్ల వద్ద కూడా ఎటువంటి రుసుములూ చెల్లించాల్సిన అవసరం ఉండదు.

రిజిస్ట్రేషన్‌కు చెల్లించాల్సింది ఎక్కువే..

బీహెచ్-సిరీస్ మొదటి రిజిస్ట్రేషన్ సంవత్సరంలో ప్రారంభమవుతుంది. బీహెచ్ అనే పదం చివర అల్ఫాన్యూమరిక్ అంకెలతో కనిపిస్తుంది(ఉదాహరణకు 24 బీహెచ్ 1212 ఏఏ). కారు కోసం రిజిస్ట్రేషన్ చేయించాలంటే దాదాపు రూ.3 లక్షలకుపైగా అవుతుందని రవాణా శాఖాధికారులు చెబుతున్నారు. ప్రతి రెండు సంవత్సరాల కాలానికి మోటార్ వాహన పన్ను ఈ విధానంలో విధిస్తారు. రిజిస్ట్రేషన్ తేదీ నుంచి 14 సంవత్సరాలు పూర్తయిన తర్వాత, మోటార్ వాహన పన్ను వార్షిక ప్రాతిపదిన విధిస్తారు.

వీరే అర్హులు..

వాస్తవానికి ఈ సిరీస్‌తో రిజిస్ట్రేషన్ అందరికీ ఇవ్వరు. కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ ప్రకారం..బీహెచ్-సిరీస్‌ను రక్షణ సిబ్బంది, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలకు(పీఎస్‌యూ) స్వచ్ఛందంగా అందుబాటులో ఉంటుంది. నాలుగు లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో వారి కార్యాలయాలు ఉన్న ప్రైవేట్ రంగ సంస్థల సిబ్బంది కూడా దీనిని పొందవచ్చు.

తనిఖీలు చేపడుతున్నాం..



బీహెచ్ సిరీస్ వాహనాలపై ప్రత్యేక తనిఖీ కొనసాగిస్తున్నాం. తగిన నిబంధనల మేరకే వాటిని వినియోగించాల్సి ఉంది. ఈ రిజిస్ట్రేషన్ నంబర్లతో జిల్లాలో తిరుగుతున్న వాహనాలకు సంబంధించిన యజమానులు వెంటనే పన్ను చెల్లించాలి. అపరాధ రుసుం లేకుండా చెల్లించవచ్చు. లేకుంటే వాహనాలు సీజ్ చేస్తాం.
– ఎం.శశికుమార్, జిల్లా రవాణా శాఖ అధికారి

జరుగుతున్నది ఇదీ..

ఒకే దేశం, ఒకే రిజిస్ట్రేషన్(వన్ నేషన్-వన్ రిజిస్ట్రేషన్)విధానంతో ఏర్పాటు చేసిన భారత్ రిజిస్ట్రేషన్ నంబర్‌ను కలిగి ఉంటే.. అదే నంబరుతో దేశ వ్యాప్తంగా వాహనాన్ని వినియోగించవచ్చన్న ఆలోచనతో వినియోగదారులు ఉన్నారు. పన్నులను ఎగ్గొడుతున్నారు. బీహెచ్ రిజిస్ట్రేషన్‌తో పాటు, సంబంధిత రాష్ట్రంలో పన్ను చెల్లించి మాత్రమే వాహనాన్ని వినియోగించాలి. బీహెచ్ సిరీస్‌తో ఒక రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ అయితే ఆ వాహనాన్ని అదే రాష్ట్రంలో వినియోగించాలి. వాహనదారుడు తన వాహనాన్ని వేరే రాష్ట్రంలో ఉపయోగించాలనుకుంటే.. అక్కడి పన్ను విధానాన్ని బట్టి మోటార్ వాహనాల పన్ను చెల్లించాల్సి వస్తుంది. దీనికి భిన్నంగా కొంత మంది అరుణాచల్‌ప్రదేశ్ లేదా ఇతర రాష్ట్రాలలో వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేసుకుని, సంబంధిత రాష్ట్రంలో పన్ను చెల్లించి, ఆంధ్రప్రదేశ్‌లో మోటార్ వాహనాల పన్ను చెల్లించకుండా ఇక్కడ వాహనాన్ని వినియోగిస్తున్నారు. తద్వారా పెద్ద ఎత్తున ప్రభుత్వానికి ఆదాయానికి గండి కొడుతున్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు బొబ్బిలి విద్యార్థులు


క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే బేబీ నాయన

బొబ్బిలి: పట్టణంలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న పది మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు కోచ్ బంకురు ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఆ క్రీడాకారులందరినీ బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయనకు పరిచయం చేయగా ఆయన వారిని అభినందించారు. ఈనెల 2,3,4 తేదీల్లో అనంతపురం జిల్లా తాడిపత్రిలో సబ్ జూనియర్, కేడెట్ విభాగాల్లో ఈ పోటీలు జరగనున్నాయని కోచ్ తెలిపారు. పోటీలకు జె.జ్యోత్స్న ప్రియ, బి.వరలక్ష్మి, ఎస్.రోషన్, బి.హాసిని, పి.షర్మిల, ఎస్.జాజిలి, బి.ఆదిత్య, ఎస్.నిహాల్, ప్రవీణ్‌కుమార్, బి.శివరామకృష్ణలు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నట్లు కోచ్ చెప్పారు. కార్యక్రమంలో తైక్వాండో క్లబ్ సభ్యులు ఎస్.శ్రీనివాసరావు, పి.రవికుమార్, డి.కల్యాణ్, టీమ్ మేనేజర్ కె.అభినవ్ పాల్గొన్నారు.

20 తులాల బంగారం, నగదు చోరీ


దొంగలు పగలగొట్టిన బీరువా

బొబ్బిలిరూరల్: మండలంలోని పారాది గ్రామానికి చెందిన గంటనాగమణి ఇంట్లో చోరీ జరిగి 20 తులాల బంగారం పోయింది. ఈ ఘటనపై బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం ఆమె 15 రోజులుగా తన ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. ఆరోగ్యం బాగా లేకపోవడంతో బొబ్బిలిలో ఉంటున్న చెల్లెలు శ్రీదేవి ఇంట్లో ఉంటూ చికిత్స పొందుతోంది. 1వ తారీఖున పింఛన్ అందుకునేందుకు బుధవారం ఆమె గ్రామానికి వచ్చి ఇంటికి వెళ్లిచూడగా వెనుక తలుపులు బద్దలు కొట్టి ఉండి, ఇంట్లో సామగ్రి అంతా చిందరవందరగా పడి ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. బీరువాను పగలకొట్టి లాకర్‌లో ఉన్న 20 తులాల బంగారం, రూ.25వేలు దొంగలు దోచుకెళ్లారని వాపోయింది. ఏ రోజు దొంగతనం జరిగిందో తనకు తెలియదని న్యాయం చేయాలని పోలీసులను కోరింది. దీనిపై ఏఎస్సై భాస్కర్రావు మాట్లాడుతూ ఎంత బంగారం, డబ్బు చోరీ జరిగిందో స్పష్టత లేదన్నారు. ఒక్కోసారి ఒక్కో విధంగా బాధితురాలు చెబుతుండడంతో గందరగోళంగా ఉందని, ఫిర్యాదు మేరకు క్లూస్‌టీంతో ఆధారాలు సేకరిస్తున్నామని, ఉన్నతాధికారులు దర్యాప్తు చేస్తున్నారని ఏఎస్సై తెలియజేశారు.

హోటల్ నిర్వాహకుడి ఆత్మహత్య

- అప్పులున్నాయంటూ సూసైడ్ నోట్


ఆత్మహత్యకు పాల్పడిన రవికుమార్


రవికుమార్ (ఫైల్)

చీపురుపల్లి: ఎక్కడో పుట్టాడు, మరెక్కడో పెరిగాడు, తల్లిదండ్రులు, భార్యాపిల్లలు ఉన్నారో లేదో తెలియదు, నాలుగేళ్ల క్రితం చీపురుపల్లి వచ్చాడు. ఒంటరిగానే ఉంటూ అందరితో పరిచయాలు పెంచుకుని, మంచి వ్యక్తిగా పేరు తెచ్చుకుని, అక్కడక్కడా అప్పులు చేసి ఎస్‌ఆర్‌కే వింగ్స్ అనే హోటల్‌ను నడుపుతున్నాడు. ఇంతలో ఏమైందో తెలియదు కానీ తాను నివసిస్తున్న ఇంటి వంట గదిలో శ్లాబ్ హుక్‌కు నైలాన్ తాడు కట్టి మెడకు చుట్టుకుని ఉరి పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణంలోని కొత్తగవిడి వీధిలో బుధవారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో చింతా రవికుమార్(42) అనే హోటల్ నిర్వాహకుడు ఆత్మహత్యకు పాల్పడడం స్థానికులను ఉలిక్కిపడేలా చేసింది. సమాచారం మేరకు తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై కె.కిరణ్‌కుమార్ నాయుడు అక్కడి పరిస్థితులు పరిశీలించి ఆత్మహత్యకు పాల్పడడం వెనుక కారణాలు ఆరా తీసి, సంఘటనా స్థలంలో ఆధారాలను సేకరించారు. మృతుడు ఆత్మహత్యకు పాల్పడే ముందు రాసిన సూసైడ్ నోట్, సెల్‌ఫోన్‌లో ఉన్న వీడియోను ఎస్సై స్వాధీనం చేసుకున్నారు.

చాలా మందికి డబ్బులివ్వాలి

ఆత్మహత్యకు ముందు రవికుమార్ సూసైడ్ నోట్ రాయడంతో పాటు తన సెల్‌ఫోన్‌లో వీడియో రికార్డ్ చేశాడు. తాను చాలా మంది వద్ద అప్పు తీసుకున్నానని, వారందరికీ డబ్బులు ఇవ్వాలని లేఖలో పేర్కొన్నాడు. తన ఇంటిలో రూ.50 వేలు ఉంచానని ఆ డబ్బులతోనే మాజీ వార్డు మెంబర్ గవిడి నాగరాజు ఆధ్వర్యంలో తన అంత్యక్రియలు జరగాలని కోరుకుంటున్నట్లు రాశాడు. సూసైడ్ నోట్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి పోలీసులు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్ కుమార్ నాయుడు తెలిపారు.

బధిర పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం

విజయనగరం టౌన్: స్థానిక పూల్‌బాగ్ కాలనీలో ఉన్న ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో 2024–25 సంవత్సరానికి గాను చెవిటి, మూగ బాల,బాలికల ప్రవేశాలకు సంబంధించి ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకూ అడ్మిషన్లు ప్రారంభించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జె.దయానంద బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారు ఈ పాఠశాలలో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. ఒకటో తరగతిలో చేరడానికి ఆరు నుంచి ఎనిమిదేళ్ల వయసు కలిగి ఉండాలన్నారు. వినికిడి లోపం ఉన్నట్లు సదరం సర్టిఫికెట్, పుట్టిన తేదీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, పాఠశాల బదిలీ సర్టిఫికెట్‌తో పాటు రైస్/రేషన్ కార్డ్, ఆధార్, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్ జిరాక్స్ కాపీలతో పాఠశాలలో సంప్రదించాలని సూచించారు. ఎటువంటి ప్రవేశరుసుం, డొనేషన్‌లు లేవని, సుశిక్షితులైన ఉపాధ్యాయులతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇతర వివరాలకు ఫోన్ 9000013640, 9440437629 నంబర్లను సంప్రదించాలని కోరారు.

లాభాల బాటలో డీసీసీబీ

- గత ఆర్థిక సంవత్సరంలో 14.3 శాతం మేర వ్యాపారవృద్ధి
- రూ.746.26 లక్షల నికర లాభం
- డీసీసీబీ మహాజన సభలో పర్సన్ ఇన్‌చార్జి, జేసీ కార్తీక్


సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్

విజయనగరం అర్బన్: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) ప్రగతి బాటలో పయనిస్తోందని, డిపాజిట్లు, పెట్టుబడులను మరింత పెంచేందుకు కృషి చేయాలని బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ సిబ్బందిని కోరారు. బ్యాంక్ మహాజన సభ బ్యాంకు సమావేశమందిరంలో బుధవారం జరిగింది. గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు సాధించిన ప్రగతి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యకలాపాలు, తీసుకోవాల్సిన చర్యలను ఇన్‌చార్జి సీఈఓ సీహెచ్ ఉమాహేశ్వరరావు వివరించారు. బ్యాంకు 107వ వార్షిక నివేదికను సభ్యులముందు ఉంచారు. సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ డీసీసీబీ వ్యాపారం మునుపటి ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే గత ఆర్థిక సంవత్సరంలో 14.3 శాతం వృద్ధి సాధించడం శుభపరిణామమని పేర్కొన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.1,83,865.32 లక్షల వ్యాపారం చేయగా, 2023–24లో రూ.2,10,153.21 లక్షల వ్యాపారం జరిగిందన్నారు. అదే సమయంలో బ్యాంకు సొంత నిధులు 14.14 శాతం వృద్ధితో రూ.16,412.38 లక్షల నుంచి రూ.18,732.46 లక్షలకు పెరిగాయని చెప్పారు. బ్యాంకు డిపాజిట్లు రూ.27,654.41 లక్షల నుంచి 9.27 శాతం వృద్ధితో రూ.30,218.44 లక్షలకు పెరిగాయని తెలిపారు. బ్యాంకు పెట్టుబడులు 16.36 శాతం, ఆప్కాబ్ రుణాలు కూడా సుమారు 17.5 శాతం పెరిగాయన్నారు. గతేడాది లాభం రూ.729.37 లక్షలుకాగా, 2023–24 సంవత్సరంలో రూ.746.26 లక్షల నికర లాభాన్ని ఆర్జించినట్టు వివరించారు. ఎన్‌పీఏను తగ్గించాల్సిన అవసరం ఉందని, డిపాజిట్లను మరింత పెంచేందుకు కృషి చేయాలని కోరారు. పీఏసీఎస్‌లను కంప్యూటరీకరించాలని, జవాబుదారీతనాన్ని పెంచాలని జేసీ సూచించారు. నాబార్డు డీడీఎం నాగార్జున మాట్లాడుతూ డీసీసీబీ బ్యాంకు పరపతిని పెంచాలన్నారు. బ్యాంకు సుమారు రూ.1528 కోట్లు నాబార్డు ద్వారా రీఫైనాన్స్ చేయడం జరుగుతోందన్నారు. పీఏసీఎస్‌లు మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని, ఆదాయం పెంచుకొని బలోపేతం కావాలని సూచించారు. జిల్లా సహకార అధికారి రమేష్ మాట్లాడుతూ జిల్లాలో 65 ప్రాథమిక సహకార సంఘాలు ఉండగా వీటిలో కేవలం 10 మాత్రమే లాభాల్లో ఉన్నాయన్నారు. బైద్యనాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు నష్టాలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మహాజన సభలో పార్వతీపురం మన్యం జిల్లా సహకార అధికారి శ్రీరామ్మూర్తి, డీసీఏఓ శ్రీరామ్మూర్తి, పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జిలు, డీసీసీబీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


హాజరైన పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జిలు, డీసీసీబీ అధికారులు

సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలి


వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

- కలెక్టర్ బీఆర్.అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: పర్యావరణ పరిరక్షణ కోసం సౌరవిద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాల్సి ఉందని కలెక్టర్ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ అన్నారు. సౌర విద్యుత్‌ను వినియోగించేవారికి కేంద్ర ప్రభుత్వం పలు రాయితీలు కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఆయా కుటుంబాలు విద్యుత్ బిల్లులు ఆదా చేసుకుని ఆర్థికంగా ప్రయోజనం పొందవచ్చన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథాకానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్లలో సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్రం ప్రభుత్వం సూర్యఘర్ పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. ఈ పథకం క్రింద గృహాల్లో సౌర విద్యుత్ ఫలకాలు ఏర్పాటు చేసుకునే వారికి గరిష్ఠంగా మూడు కిలో వాట్ల వరకు రాయితీ కల్పిస్తోందని తెలిపారు. ఒక కిలో వాట్ సామర్థ్యం గల యూనిట్‌పై రూ.30 వేల వరకు రాయితీ పొందవచ్చన్నారు. ఈ పథకం కింద ఇళ్లలో సౌర విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేసుకునే ఆసక్తి గల వారు పీఎం సూర్యఘర్ యాప్ ద్వారా పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ కోసం రూ.1000 రుసుం చెల్లించాల్సి ఉంటుందని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ లక్ష్మణరావు తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డీఆర్‌ఓ ఎస్డీ అనిత, విద్యుత్‌శాఖ ఈఈలు పూడి హరి, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

కేసుల్లో దర్యాప్తు వేగవంతం

- గంజాయి, సారాపై ఉక్కుపాదం
- నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ మాధవరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి

పార్వతీపురంటౌన్: వివిధ కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి అన్నారు.ఈ మేరకు బుధవారం ఆయన పార్వతీపురం పట్టణంలోని మల్టీఫంక్షన్ హాల్‌లో పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసులను సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రత్యేక కార్యచరణతో కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గంజాయి, సారా అక్రమ రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని, ఎస్‌ఈబీ అధికారులతో కలిసి దాడులు నిర్వహించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఓపెన్ డ్రింకింగ్, డ్రంకెన్ డ్రైవ్ విధిగా నిర్వహించాలని, ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో వాహన దారులను అప్రమత్తం చేస్తూ సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలి

రోడ్డు ప్రమాదాల మీద ఎస్పీ మాధవ రెడ్డి సమీక్ష నిర్వహించి తగు నిర్దేశాలు జారీచేశారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన తరువాత ఫారం–1,5,7 లను నింపి సంబంధిత పత్రాలను జతచేసి ఐరాడ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టి రోడ్డు భద్రత నియమాలపై వినూత్న రీతిలో అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. వాహన తనిఖీలు చేపట్టాలని, డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ తనిఖీలు నిర్వహించాలని స్పష్టం చేశారు. సైబర్ నేరాలపై దృష్టిసారించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డాక్టర్ ఒ.దిలీప్ కిరణ్, ఏఎస్పీ సునీల్ షరోన్, పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు, ఎస్బీ సీఐ లక్ష్మణరావు, డీసీఆర్‌బీ సీఐ బి.ఎం.డి.ప్రసాద్, ఏఆర్ ఆర్‌ఐ శ్రీరాములు, జిల్లా సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

- గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కట్టిమణి


సదస్సులోని వక్తలతో యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి

విజయనగరం అర్బన్: మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల వాడకం, రవాణా తీవ్రమైన నేరమని అటువంటి వాటి జోలికి యువత ఆకర్షితులు కాకుండా ఉండాలని కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి పిలుపునిచ్చారు. యూనివర్సిటీ ఇంటర్నల్ కంప్లయింట్స్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం యూనివర్సిటీ ప్రాంగణంలో 'మాదకద్రవ్యాల వినియోగం అక్రమ రవాణా/లైంగిక వేధింపులపై చట్టపరమైన అంశాలపై జరిగిన ఒకరోజు సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత గంజాయి, కొకైన్, మద్యం, సిగరెట్, గుట్కాలు తదితర మత్తు పదార్థాల వ్యసనానికి గురి కాకుండా తమ దృష్టిని చదువుపై కేంద్రీకరించి జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. అనంతరం సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవా సమితి అధ్యక్షురాలు కె.విజయ కల్యాణి మాట్లాడుతూ ర్యాగింగ్, ప్రేమ వ్యవహారాలు, మత్తు పదార్థాల వినియోగం, రవాణా యువతను నిర్వీర్యం చేస్తున్నాయని అందువల్ల వారు తమ లక్ష్యాలకు దూరమవడమే కాకుండా తల్లిదండ్రులను, కుటుంబాన్ని కూడా న్యాయపరమైన సమస్యలలోకి నెడుతున్నారని, ఇటువంటి విషయాలలో అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. డీఎస్పీ డి.విశ్వనాథ్ మాట్లాడుతూ యువతీ యువకులు చట్టపరమైన చిక్కుల్లో పడకుండా ఏ విధంగా జీవితాన్ని ఉన్నతంగా ఆదర్శవంతంగా మంచి భవిష్యత్తు వైపు మరల్చుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ వీఎస్‌ప్రసాద్, టూ టౌన్ సీఐ కె.రామారావు, యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ తంత్రవాహి శ్రీనివాసన్, ప్రొఫెసర్ శరత్చంద్రబాబు, ఐసీసీ అధ్యక్షురాలు డాక్టర్ పరికిపండ్ల శ్రీదేవి, డాక్టర్ అనిరుధ్ కుమార్, డాక్టర్ దివ్య, డాక్టర్ ప్రమా, డాక్టర్ కుసుమ్, డాక్టర్ ఎస్‌వీసూర్యనారాయణ, బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.